

28న అండర్-12 పురుషుల క్రికెట్ జట్టు ఎంపికలు

ప్రజాశక్తి - కడప

ఈనెల 28న కడపలోని వై.ఎస్.రాజారెడ్డి ఎసిఎ క్రికెట్ స్టేడియంలో అండర్ -12 పురుషుల జిల్లా జట్టు ఎంపికలు నిర్వహిస్తున్నట్లు జిల్లా క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి ఏ. రెడ్డి ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల క్రీడాకారులు ఎంపికల్లో పాల్గొనాలని కోరారు. ఎంపికలకు హాజరయ్యే క్రీడాకారులు తమతోపాటు ఆధార్ కార్డు, బర్త్ సర్టిఫికెట్ (ఫారం 5), మూడు సంవత్సరాల ప్రోగ్రెస్ కార్డు, ప్రజెంట్ స్టడీ సర్టిఫికెట్స్ ఒరిజినల్‌తో పాటు ఒక సెట్టు జిరాక్స్, పాటు ఒక పాస్పోర్ట్ ఫొటో తప్పనిసరిగా తీసుకురావాలని తెలిపారు. ఎంపికల్లో పాల్గొనే క్రీడాకారులు తప్పనిసరిగా వైట్ డ్రెస్‌తో పాటు, ఎవరి క్రికెట్ కిట్ బ్యాగులు వారే తెచ్చుకోవాలని తెలిపారు. 2013 సెప్టెంబర్ 1 తర్వాత జన్మించిన వారు ఎంపికల్లో పాల్గొనేందుకు అర్హులని తెలిపారు.

చంద్రన్న బీమాకు గ్రహణం

- 18 నెలలు అవుతున్నా అమలు కానీ పథకం
- రేషన్ కార్డు లబ్ధిదారులకు వర్తించని బీమా
- కుటుంబ పెద్దను కోల్పోతే పరిహారం శూన్యం
- బీమాపై స్పష్టత ఇవ్వని ప్రభుత్వం





ప్రజాశక్తి-పులివెందుల టౌన్

చంద్రన్న బీమాకు గ్రహణం ఏర్పడింది.. ఎన్నికల సమయంలో కూటమి ప్రభుత్వం సహజ మరణానికి రూ.5 లక్షలు, ప్రమాదవశాత్తూ మరణిస్తే రూ.10 లక్షలు ఇస్తామని హామీ ఇచ్చింది. ప్రభుత్వం ఏర్పడి 18 నెలలు కావస్తున్నా అమలు కానీ పరిస్థితి. బీమాపై ప్రభుత్వం నుంచి ఇంతవరకు ఎలాంటి స్పష్టత లేదు. ప్రమాదాలు, సహజమరణాల్లో కుటుంబ పెద్ద దిక్కును కోల్పోయిన పేదలకు అండగా ఉండే బీమా పథకం అమలుపై నీలిమేఘాలు కమ్ముకున్నాయి. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి ఏడాదిన్నర అవుతున్నా బీమా పథకం అమలుపై ఎటువంటి ప్రకటనా చేయలేదు. రేషన్ కార్డు ఉన్న కుటుంబ పెద్ద ఆకస్మిక, సహజ మరణం పొందినపుడు ఆ కుటుంబానికి ఆర్థిక ఉపశమనం కలిగించడం కోసం ప్రభుత్వం బీమా పథకం ప్రవేశపెట్టింది. 2014-19 మధ్య అప్పటి తెలుగుదేశం ప్రభుత్వం చంద్రన్న బీమా పథకం అమలు చేసింది. అనంతరం వైసిపి ప్రభుత్వంలో వైఎస్ఆర్ బీమా అనే పేరుతో ఈ పథకం అమలు చేసింది.

అమలు ఇలా...

కుటుంబ పెద్ద సహజంగా మరణిస్తే రూ.2 లక్షలు, ప్రమాదవశాత్తూ చనిపోతే రూ.5 లక్షలు, శాశ్వత వికలాంగులుగా మారితే రూ.5 లక్షలు, 70 ఏళ్ల వ్యక్తి ప్రమాదవశాత్తూ మరణిస్తే రూ.3లక్షలు అందించే విధంగా పథకం రూపకల్పన చేసింది. జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ (డిఆర్‌డిఎ) ఆధ్వర్యంలో బీమా పథకం అమలు చేసేవారు. ఇందుకోసం ప్రత్యేకంగా కంట్రోల్ రూంతోపాటు 24 గంటలూ పనిచేసే విధంగా అధికారులను కేటాయించారు. ఫోన్ ద్వారా సమాచారం అందిన వెంటనే వివరాలు నమోదు చేసుకుని, దగ్గరలోని ఎపిఎంలకు, యానిమేటర్లకు విషయం తెలిపి సకాలంలో బీమా మొత్తాన్ని బాధిత కుటుంబానికి అందజేసేలా చర్యలు తీసుకునేవారు. కూటిమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే చంద్రన్న బీమా పథకం అమలు చేస్తామని ప్రజాగళం ఉమ్మడి మేనిఫెస్టో'లో ఆ పార్టీల నాయకులు హామీచ్చారు. గతం కన్నా మిన్నగా ఆర్థికప్రయోజనం చేకూరుస్తామని గొప్పలు చెప్పారు. సహజ మరణానికి రూ.5 లక్షలు, ప్రమాదవశాత్తూ మరణిస్తే రూ.10 లక్షలు బీమా సౌకర్యం కల్పిస్తామని ప్రకటనలు చేశారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి ఏడాదిన్నర పూర్తవుతున్నా ఇంతవరకూ చంద్రన్న బీమా పథకం గురించి పార్టీ నాయకులెవరూ మాట్లాడని పరిస్థితి నెలకొంది. పెద్దదిక్కును కోల్పోయిన కుటుంబాలు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నాయి. ఇలాంటి వారికి బీమా అమలు చేసి ఉంటే కాసింత ఉపశమనం కలిగేదని బాధిత కుటుంబాలు పేర్కొంటున్నాయి. గత ప్రభుత్వ హయాంలో వైఎస్ఆర్ బీమా పథకం అమలకు నోచుకోలేదు. అప్పట్లో ప్రమాదవశాత్తు, సహజ మరణం చెందిన వారికి ఎలాంటి బీమా అందించలేదు. అడపాదడపా నూటికి ఒకరికో ఇద్దరికి బీమా సొమ్మును అందించి చేతులు దులుపుకున్నారని పలువురు విమర్శిస్తున్నారు.

రేషన్ కార్డు లబ్దిదారులకు వర్తించని బీమా..

ప్రభుత్వం పేదల సంక్షేమాన్ని గాలి కొదిలేసింది. దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న కుటుంబాలకు ఎంతో ఉపయోగకరంగా ఉన్న బీమా పథకం అమలులో తాత్సారం చేస్తోంది. జిల్లాలో రేషన్ కార్డులు ఉన్న కుటుంబాలు 5,73,675 లక్షలు ఉన్నాయి. రెవెన్యూ డివిజన్ల వారీగా చూస్తే పులివెందుల 90,779, కడప 1,75,438, జమ్మలమడుగు 1,92309, బద్వేల్ 1,15,148 కలిపి మొత్తం 5,73,675 రేషన్ కార్డులు ఉన్నాయి. గతేడాది (2024-25)లో వివిధ ప్రమాదాల్లో 400 మంది దాకా చనిపోయారు. ఈ ఆర్థిక సంవత్సరం (2025-26)లో ఇప్పటి వరకు 350 మంది దాకా మరణించారు. ఏటా 950 నుంచి 1100 సహజ మరణాలు నమోదవుతున్నాయి. వందలాది మంది ప్రమాదాల కారణంగా వైకల్యం బారినపడి మంచానపడ్డారు. బీమా పథకం లేకపోవడంతో ఆయా బాధిత కుటుంబాలు రోడ్డునపడ్డాయి. బీమా విషయం పై ప్రభుత్వం తనకేమీ పట్టనట్టు వ్యవహరిస్తుండటంపై పేదలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కుటుంబ పోషణ, పిల్లల చదువులకు ఇబ్బందులు ఏర్పడుతున్నాయని, ప్రభుత్వం స్పందించి బీమా పథకాన్ని అమలు చేయాలని కోరుతున్నారు.

బీమా పథకం అమలుచేయాలి

కూటమి నాయకులు ఎన్నికల హామీలో భాగమైన చంద్రన్న బీమా పథకం తక్షణమే అమలు చేయాలి. రేషన్ కార్డు ఉన్న ప్రతి ఒక్కరికీ ఈ పథకం ఎంతో ఉపయోగకరం. ప్రమాదాలు సహజ మరణాల్లో కుటుంబాన్ని పోషించే పెద్ద మరణిస్తే ఆ కుటుంబం ఆర్థిక ఇబ్బందులతో కొట్టు మిట్టాడుతుంది బీమా సొమ్ము ఆ కుటుంబానికి భరోసా ఇస్తుంది. కూటమి ప్రభుత్వ నాయకులు బీమా పథకం అమలు చేసేందుకు చొరవ చూపాలి.

- మనోహర్ , సిఐటియు నాయకులు

ఇ-నారీ.. భేరీ



- ఉభయ జిల్లాల్లో రాజకీయ ఎంపికలు?!
- అన్నమయ్యలో 700, కడపలో 600?
- కొత్త ఏడాది నుంచి కార్యకలాపాలు



ప్రజాశక్తి - కడప ప్రతినిధి

డ్వాక్రా సంఘాలను మరింత పరిపుష్టం చేయాలనే ఉద్దేశంతో ఇ-నారీ పేరిట సభ్యుల ఎంపిక చేపట్టింది. కడప, అన్నమయ్య జిల్లా వ్యాప్తంగా సుమారు 1,300 మంది డ్వాక్రా సంఘాల్లోని చురుకైన సభ్యులను ఎంపిక చేయడంపై రాజకీయ జోక్యం పెరిగింది. ఈ నెల 25 నుంచి 30వ తేదీ నాటికి ఇ-నారీ సభ్యుల ఎంపిక ప్రక్రియను పూర్తి చేసే దిశగా గ్రామీణాభివృద్ధిశాఖ వేగంగా కదులుతోంది. 2026 జనవరి ఒకటి నుంచి ఇ-నారీ సభ్యుల విధులకు సంబంధించిన అంశాలపై శిక్షణ కార్యకలాపాలు నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తోంది.

ఉభయ జిల్లాలో డ్వాక్రా సంఘాల ఆధునీకరణ ఊపందుకుంది. కడప జిల్లాలోని 26,423 స్వయం సహాయక సంఘాలు ఉన్నాయి. ఈలెక్కన కడప జిల్లాలో 600 మంది, అన్నమయ్య జిల్లాలోని 29 వేల స్వయసహాయక సంఘాలకుగానూ 700 మందిని కలిపితే 1,300 మంది వరకు నియమితులయ్యే అవకాశాలు ఉన్నాయి. వీరిని జిల్లా గ్రామీణాభివృద్ధిశాఖ పరిధిలోని స్త్రీనిధి, పరపతి సమాఖ్య, ఇతర ఆర్థిక వ్యవహారాలు మొదలుకుని మనడబ్బులు-మన లెక్కల యాప్ ద్వారా డ్వాక్రా సంఘాల రుణాల చెల్లింపులు, దుర్వినియోగాన్ని అరికట్టడం, జీవనోపాధుల కార్యక్రమాలను పెంపొందించడం, ప్రభుత్వ సర్వేలు తదితర అంశాల్లో ఇ-నారీ మహిళలను ఉపయోగించుకోనుంది. ప్రతి ఇ-నారీ ఎంపికలో టెన్త్ నుంచి డిగ్రీ అర్హత, 18 నుంచి 45 ఏళ్లు కలిగిన డ్వాక్రా సంఘాల్లోని సభ్యులను ఎంపిక చేయనున్నారు. ప్రతి 25 డ్వాక్రా సంఘాలకు ఇద్దరు చొప్పున ఇ-నారీ సభ్యులు, ఆపై పెరిగితే ప్రతి 10 మంది మందికి ఒకరు చొప్పున సిఆర్‌పిల ఎంపిక ఊపం దుకుంది.

రోజుకు రూ.300 పారితోషికం

ఇ-నారీ, సిఆర్‌పిఎఫ్ సభ్యులకు రోజుకు రూ.300 చొప్పున పారితోషికం చెల్లించనున్నారు. నెల రోజుల వ్యవధిలో 15 రోజులకు రెండు నుంచి మూడు రోజులు మాత్రమే విధులు నిర్వహించే అవకాశం ఉంది. ఈలెక్కన నెలకు కనిష్టంగా నాలుగు నుంచి గరిష్టంగా ఎనిమిది రోజులకు రూ.2,400 మాత్రమే పారితోషికం లభించనుంది. మనబడి-మన లెక్కల పేరిట రూపొందించిన యాప్ ద్వారా ఆధార్ ఎంటర్ చేయడం ద్వారా డ్వాక్రా రుణాల వినియోగం, జీవనోపాధుల కల్పన, ప్రభుత్వ సర్వేల విధులను నిర్వహించాల్సి ఉంటుంది.

ఇ-నారీ ఎంపికల్లోనూ రాజకీయమే

ఇ-నారీ, సిఆర్‌పిఎఫ్ ఎంపికలో రాజకీయ జోక్యం పెరిగిందనే వాదన వినిపిస్తోంది. కడప జిల్లాలో ఏడు, అన్నమయ్య జిల్లాలో ఆరు అసెంబ్లీలు ఉన్నాయి. ఈలెక్కన 13 నియోజకవర్గాలకు చెందిన అధికార పార్టీ ఇన్‌ఛార్జులు ఎంపికల్లో కీలక పాత్ర పోషిస్తున్నారనే విమర్శలు ఉన్నాయి.

జనవరి నుంచే...

2026 జనవరి నాటికి ఇ-నారీ ఎంపికల ప్రక్రియను పూర్తి చేయనున్నారు. అనంతరం ఉభయ జిల్లా కేంద్రాల్లో ఎంపికైన ఇ-నారీ, సిఆర్‌పిఎఫ్‌లకు శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించనుంచి. అనంతరం ఇ-నారీ, సిఆర్‌పిఎఫ్‌లకు విధులు అప్పగించనుంది.

క్రిస్మస్ వేడుకల్లో మాజీ సిఎం జగన్

ప్రజాశక్తి-పులివెందుల టౌన్

మాజీ ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఆయన కుటుంబ సభ్యులతో కలిసి క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్నారు. గురువారం క్రిస్మస్ సందర్భంగా పట్టణంలోని సిఎస్ఐ చర్చిలో ఉదయం 8.45 గంటల నుండి 11 గంటల వరకు తల్లి వైఎస్.విజయలక్ష్మి, సతీమణి వైఎస్.భారతి, కుటుంబ సభ్యులు ప్రత్యేక ప్రార్ధనలలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులతో కలిసి కేక్ కట్ చేసి రాష్ట్ర ప్రజలకు ఆయన క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం సిఎస్ఐ చర్చి రూపొందించిన నూతన సంవత్సర కేలండర్‌ను జగన్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ సత్య పథం వైపు నడవాలన్నారు. చర్చిలో తన వద్దకు వచ్చిన చిన్నారులను మహిళలను అప్యాయంగా పలకరించారు. జగన్ మోహన్ రెడ్డిని కలిసేందుకు జిల్లా చుట్టూ పక్కల నుంచి అబిమానులు పార్టీ కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలివచ్చారు. చర్చి ప్రాంగణం అంత జన సందోహంలో నిండి పోయింది. అందరిని అప్యాయంగా పలకరిస్తూ ముందుకు సాగారు. కార్యక్రమంలో కడప పార్లమెంట్ సభ్యులు వైఎస్.అవినాష్‌రెడ్డి, రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి, రాయచోటి, కడప, రైల్వేకోడూరు మాజీ ఎమ్మెల్యేలు గడికోట శ్రీకాంత్‌రెడ్డి, అంజాద్‌బాషా, కోరుముట్ల శ్రీనివాసులు, వైఎస్ కుటుంబ సభ్యులు వైఎస్.ప్రకాష్‌రెడ్డి, వైఎస్.మనోహర్‌రెడ్డి, వైఎస్.మదన్ మోహన్‌రెడ్డి, వైఎస్.ప్రతాపరెడ్డి, మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ చిన్నప్ప, ప్రజాప్రతినిధులు, చర్చి పాస్టర్స్ పాల్గొన్నారు. కాగా క్రిస్మస్ వేడుకలు ముగిసిన వెంటనే హెలికాప్టర్‌లో జగన్ బెంగళూరుకు బయలుదేరి వెళ్లారు.



చర్చిలో ప్రత్యేక ప్రార్ధనలో పాల్గొన్న వై.ఎస్. జగన్, విజయమ్మ



జగన్‌కు కేక్ తినిపిస్తున్న విజయమ్మ

సిపిఎం నేత అప్పలరాజుపై పీడీ చట్టం ఎత్తివేయాలి

- సిపిఎం నగర కార్యదర్శి రామమోహన్ డిమాండ్

ప్రజాశక్తి - కడప అర్బన్

సిపిఎం అనకాపల్లి జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు యం.అప్పలరాజుపై అక్రమంగా బనాయించిన ప్రివెంటివ్ డిటెన్షన్ చట్టం కేసును ఎత్తివేసి అతనిని వెంటనే విడుదల చేయాలని సిపిఎం కడప నగర కార్యదర్శి రామమోహన్, జిల్లా కమిటీ సభ్యులు దస్తగిరిరెడ్డి, నాయకులు రామకృష్ణారెడ్డి డిమాండ్ చేశారు. గురువారం నగరంలోని మృత్యుంజయకుంటలో ఉన్న సిపిఎం కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉమ్మడి విశాఖపట్నం, ప్రస్తుతం అనకాపల్లి జిల్లాలో ప్రజల సమస్యలపై నిరంతరం పనిచేస్తున్న ఆయనను చట్టవిరుద్ధంగా నిర్బంధించడాన్ని పార్టీ తీవ్రంగా ఖండిస్తున్నదన్నారు. ఫార్మా లాబీ, కార్పొరేట్లకు కొమ్ము కాసిన వారిని సంతృప్తి పర్చడానికి రాష్ట్ర ప్రభుత్వం ఇటువంటి నిరంకుశ చర్యలకు పాల్పడుతోందన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో 2013 మేలో నమోదైన కేసు మొదలు తాజాగా రాజయ్య పేట, బల్క్ డ్రగ్ పార్క్ కేసు వరకు మొత్తం 19 కేసుల్లో ప్రభుత్వం అప్పల రాజును నిందితునిగా పేర్కొందన్నారు. కానీ ఆ 19 కేసుల్లో రెండింటిలో కోర్టులు నిర్దోషిగా తేల్చగా 12 కేసులు మూసి వేయబడ్డాయని, ఒక కేసు సివిల్ వివాదంగా ఖరారు చేయగా మరో నాలుగు కేసులు దర్యాప్తులో ఉన్నాయన్నారు .ఇందులో 151 సెక్షన్ కేసులే ఎక్కువ కాబట్టి అప్పల రాజును నిర్బంధించాలన్న దుర్బుద్ధితో నమోదు చేసిన పిడి చట్టం కేసు అక్రమమని స్పష్టంగా అర్థమవుతోందన్నారు. ప్రజల ప్రయోజనాలు, ముఖ్యంగా భూములు కోల్పోతున్న పేద రైతులు, అసైన్డ్ భూములు సాగుచేస్తున్న దళిత, గిరిజన బలహీనవర్గాల వారికోసం, అలాగే వృత్తి, ఉపాధి కోల్పోయే వ్యవసాయ కార్మికులు, మత్స్యకారులు, ఇతర వృత్తిదార్ల ప్రయోజనాలు కాపాడడానికి అప్పలరాజు ఉద్యమాల్లో పాల్గొంటున్నారన్నార . పిడి చట్టం నోటీసులో పేర్కొన్నట్టు అప్పలరాజు భూకబ్జాదారుకాదని, కార్పొరేట్ల లాభాల కోసం సముద్ర తీరాన్ని, పర్యావరణాన్ని విషతుల్యం చేస్తున్న ప్రయత్నాలను ఎండగట్టి రాజ్యాంగం, చట్ట ప్రకారం ప్రభుత్వం వ్యవహరించాలని ప్రజలను సమీకరిస్తున్నారే తప్ప ఆయన ఎవరిపైనా గూండా గిరి చేయలేదన్నారు. గంజాయి, ఎర్రచందనం రేపిస్టులు, హ్యూమన్ ట్రాఫికింగ్ చేసేవారిని వదిలి నిజాయితీతో, నిస్వార్ధంగా ప్రజలకోసం పోరాడుతున్న అప్పల రాజుపై పిడి చట్టం ప్రయోగించడం ప్రభుత్వ నైజాన్ని తెలియజేస్తుందన్నారు. ప్రజల కోసం పనిచేస్తున్న అప్పల రాజుపై చట్టవిరుద్ధంగా బనాయించిన అక్రమ పిడి చట్టం కేసును ఉపసంహరించి, వెంటనే విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రజాతంత్ర వాదులు, వామపక్ష, లౌకిక పార్టీలు, సంఘాలు ప్రభుత్వ చర్యను ఖండించాలని, పిడి యాక్టు కేసును ఉపసంహరించేలా ఒత్తిడి చేయాలని వారు విజ్ఞప్తి చేశారు.

కొనసాగుతున్న క్రికెట్ పోటీలు

- మొదటి ఇన్నింగ్స్‌లో ఆంధ్ర 248 ఆలౌట్

ప్రజాశక్తి - కడప

కడపలోని వైఎస్ రాజారెడ్డి ఎసిఎ స్టేడియంలో జరుగుతున్న కూచ్ బెహార్ ట్రోఫీ క్వాటర్ ఫైనల్ మ్యాచ్‌లో ఒక వికెట్ నష్టానికి 42 పరుగుల ఓవర్ నైట్ స్కోర్‌తో రెండవ రోజు బ్యాటింగ్ ప్రారంభించిన ఆంధ్ర జట్టు మొదటి ఇన్నింగ్స్‌లో 71.0 ఓవర్లలో 248 పరుగులకు అన్ని వికెట్లు కోల్పోయింది. ఆ జట్టులోని లోహిత్ లక్ష్మీనారాయణ 77 ఆనంద్ జోషియా 40 పరుగులు చేశారు. సౌరాష్ట్ర జట్టు లోని మోహిత్ ఉల్వ 3, పటేల్ 2, పుష్ప రాజ్ 2 వికెట్లు తీసుకున్నారు. అనంతరం రెండవ ఇన్నింగ్స్ ప్రారంభించిన సౌరాష్ట్ర రెండవ రోజు ఆట ముగిసే సమయానికి 25.0 ఓవర్లలో నాలుగు వికెట్ల నష్టానికి 107 పరుగులు చేసింది. ఆ జట్టులోని రుద్ర లఖాన 57 పరుగులు చేసి నాటౌట్ గా నిలిచాడు. ఆంధ్ర జట్టులోని తోషిత్ యాదవ్ 2, ఎన్. సాయి 2 వికెట్లు తీసుకున్నారు.



77 పరుగులు చేసిన లోహిత్

27న చలో రాజ్‌భవన్

ప్రజాశక్తి - కడప అర్బన్



సమావేశంలో మాట్లాడుతున్న అన్వేష్

పనిహక్కును కాలరాసి, గాంధీ పేరును తొలగించి జీ రాం జీ పేరుతో తెచ్చిన ఉపాధి కొత్త చట్టాన్ని రద్దు చేయాలని, 2005 ఉపాధి హామీ చట్టాన్ని బలోపేతం చేసి అమలు చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం, రైతు సంఘం జిల్లా కార్యదర్శులు అన్వేష్, దస్తగిరి రెడ్డి డిమాండ్ చేశారు. గురువారం వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహాత్మ గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని కొనసాగించాలని ఈనెల 27వ విజయవాడ చలో రాజభవన్ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. రెండు దశాబ్దాలుగా వ్యవసాయ కార్మికులకే కాకుండా సన్నా, చిన్న కారు రైతులకు అన్నం పెట్టిన, లక్షలాది ఎకరాల పేదల భూమిని అభివృద్ధి చేసి. వేలాదిమంది యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించి, పేదలకు ఆత్మస్థైర్యాన్ని, ఆర్థిక స్వాలంబనను, భూస్వామ్య దౌర్జన్యాలను ఎదుర్కొనే శక్తి నిచ్చిన జాతిపిత మహాత్మా గాంధీ గ్రామీణ ఉపాధి చట్టాన్ని ఎన్‌డిఎ ప్రభుత్వం రద్దు చేయడం దుర్మార్గమన్నారు. గుండెకాయ లాంటి హక్కును కాలరాసి మొండెం లేని తలకాయ లాగా జీ రాం జీ పేరుతో కొత్త చట్టాన్ని తెచ్చి కోట్లాదిమంది పేదలకు బిజెపి నాయకత్వంలో ఎన్‌డిఎ ప్రభుత్వం తీవ్రమైన ద్రోహం చేసిందని విమర్శించారు. ఈ చట్టానికి మన రాష్ట్రంలో ఉన్న కూటమి ప్రభుత్వం, వైసిపి ఎంపీలు ఒకటై కోట్లాదిమందికి వెన్నుపోటు పొడిచి బిజెపి తెచ్చిన కొత్త చట్టానికి ఓట్లు వేసి మన రాష్ట్రానికి ద్రోహం చేశారని పేర్కొన్నారు. జాతిపిత మహాత్మా గాంధీ పేరును తొలగించి గాంధీని చంపిన గాడ్సే పేరు వచ్చేలా జీ రామ్ జీ అని పేరు మార్చారని తెలిపారు. 2005 చట్టాన్ని మరింత బలోపేతం చేయాలని, కోట్లాది మందికి గ్యారెంటీ హక్కును రద్దు చేస్తూ 2025 కొత్త చట్టాన్ని రద్దు చేయాలని, 27న చలో రాజభవన్‌కు పిలుపునిచ్చినట్లు చెప్పారు. సమావేశంలో వ్య.కా. స జిల్లా సహాయ కార్యదర్శి సురేష్ పాల్గొన్నారు.

రోడ్డు భద్రతా నియమాలు పాటించాలి

ప్రజాశక్తి - కడప అర్బన్

కొప్పర్తి గ్రామంలో వైవీయూ ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్-8, ప్రత్యేక శిబిరం 'రహదారి భద్రత - మనుగడ' అనే అంశంపై అవగాహన' కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. ప్లకార్డుల ర్యాలీతో వైవీయూ ప్రోగ్రామ్ ఆఫీసర్ ప్రొఫెసర్ కె.ఎస్.వి. కృష్ణారావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'మీరు రోడ్డు భద్రతా నియమాలను గౌరవించి పాటిస్తే అవి మిమ్మల్ని మీ కుటుంబాన్ని సంతోషంగా జీవించేటట్టు చేస్తాయన్నారు. ఎన్‌ఎస్-ఎస్ వాలంటీర్లు ప్రతి ఇంటికి వెళ్లి రోడ్డు భద్రతా నియమాల పోస్టర్‌ను చూపించి అవగాహన కల్పించారు. వాలంటీర్లు ప్రతి ఇంటికి రోడ్డు భద్రతా నియమాల కరపత్రాన్ని పంపిణీ చేశారు. 'ప్రతి బైక్ రైడర్ లక్ష్యం సున్నా ప్రమాదం' అని వేగ పరిమితులను పాటించాలని, పరధ్యానాన్ని నివారించాలని కోరారు.



రోడ్డుభద్రతపై అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న వాలంటీర్లు



భద్రతపై మహిళలకు అవగాహన కల్పిస్తున్న పోలీసులు

మహిళా భద్రతపై విస్తృత అవగాహన

ప్రజాశక్తి - కడప అర్బన్ : ఎస్‌పి నచికేత్ విశ్వనాథ్ ఆదేశాల మేరకు 'మహిళా భద్రత స్పెషల్ డ్రైవ్ మాసం'లో భాగంగా జిల్లా వ్యాప్తంగా గ్రామాలు, కాలనీలు, పట్టణ ప్రాంతాల్లో పోలీస్ అధికారులు అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. గురువారం పోలీస్ అధికారులు ప్రత్యక్షంగా గ్రామాలు, కాలనీలను సందర్శించి మహిళలు, యువతులు, బాలికలతో ముఖాముఖీగా మాట్లాడి వారి భద్రతకు సంబంధించిన అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మహిళల రక్షణ, గౌరవం, హక్కుల పరిరక్షణకు సంబంధించిన భారత న్యాయ సంహితలోని ముఖ్యమైన చట్టాలు, శిక్షల వివరాలు, వాటి ప్రాముఖ్యతను సవివరంగా వివరించారు. మహిళలపై జరిగే వేధింపులు, గృహ హింస, బాలికలపై నేరాలు వంటి సంఘటనలు చోటు చేసుకుంటే భయపడకుండా వెంటనే పోలీస్ సహాయం తీసుకోవాలని సూచించారు. సైబర్ క్రైమ్, సోషల్ మీడియా దుర్వినియోగం, ఆన్‌లైన్ మోసాలపై ప్రత్యేకంగా అవగాహన కల్పించారు. అనుమానాస్పద లింకులు క్లిక్ చేయకూడదని, అపరిచిత కాల్స్, మెసేజ్‌లకు స్పందించవద్దని, వ్యక్తిగత వివరాలు, ఒటిపిలు ఎవరితోనూ పంచుకోకూడదని సూచించారు. మొబైల్ ఫోన్‌లు, సోషల్ మీడియా వేదికల ద్వారా ఎదురయ్యే ప్రమాదాలను అనుమానం వచ్చిన వెంటనే పోలీస్ సిబ్బందికి లేదా సైబర్ సెల్‌కు సమాచారం ఇవ్వాలని తెలిపారు. మహిళలు, చిన్నారులపై జరిగే నేరాలు లేదా సైబర్ మోసాల సమయంలో తక్షణ సహాయం కోసం అందుబాటులో ఉన్న హెల్ప్ లైన్ నంబర్లను గుర్తు చేశారు అత్యవసర పోలీసు సాయం కోసం 112, మహిళలపై వేధింపులు 1091, గృహ హింస, మహిళా సాయం, 1098 చైల్డ్‌లైన్, సైబర్ నేరాల టోల్‌ఫ్రీ 1930లకు ఫోన్ చేయాలని చెప్పారు. మహిళల భద్రత పరిరక్షణలో పోలీస్ శాఖతో పాటు ప్రజల సహకారం కూడా అత్యంత అవసరమని, అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే సమాచారం ఇవ్వాలని కోరారు.


హార్సిలీహిల్స్‌లో న్యూఇయర్ వేడుకలపై ఆంక్షలు : డిఎస్‌పి

ప్రజాశక్తి-బి.కొత్తకోట: ప్రముఖ పర్యాటక కేంద్రం హార్సిలీహిల్స్‌లో నూతన సంవత్సర వేడుకలపై పోలీసు శాఖ ఆంక్షలు విధిస్తూ నిర్ణయం తీసుకున్నట్లు మదనపల్లె డిఎస్‌పి మహేంద్ర పేర్కొన్నారు. గురువారం ఆయన ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ జిల్లా ఉన్నతాధికారులు ఆదేశాల మేరకు హార్సిలీహిల్స్‌లో న్యూ ఇయర్ వేడుకలపైన పలు ఆంక్షలు అమలు చేస్తున్నామని పేర్కొన్నారు. డిసెంబర్ 31వ తేదీ ఉదయం నుంచి జనవరి ఒకటవ తేదీ రాత్రి వరకు హార్సిలీహిల్స్‌లో ద్విచక్రవాహనాలతో పాటు ఆటోల రాక పోకలపై నిషేధం కొనసాగుతుందని తెలిపారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించటం నిషేధమన్నారు. మద్యం తాగి వాహనాలు నడిపితే చట్టపర చర్యలు తప్పవని హెచ్చరించారు. ఇతర రాష్ట్రాల మద్యం బాటిళ్లతో పట్టుపడితే కూడా కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. స్థానిక పోలీసులలో ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

ఉర్దూ బోర్డును తక్షణమే ఏర్పాటు చేయాలి

- సమైక్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు సయ్యద్ సలావుద్దీన్ డిమాండ్

ప్రజాశక్తి- కడప అర్బన్



మాట్లాడుతున్న సలావుద్దీన్

ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఉర్దూ అకాడమీ చైర్మన్ నియామకం రాష్ట్రవ్యాప్తంగా ఉర్దూ భాషాభిమానులు, సాహితీవేత్తలు, మేధావుల్లో అపారమైన ఆనందం, ఆశాభావాన్ని కలిగించిందని, ఈ కీలక నిర్ణయం తీసుకున్న దూరదృష్టి గల ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు ఉర్దూ సమాజం హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తున్నట్లు ఉర్దూ సమైక్యవేదిక రాష్ట్ర అధ్యక్షులు సయ్యద్ సలావుద్దీన్ తెలిపారు. ఆదివారం వైవి స్ట్రీట్‌లోని సమైక్య కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. ఉర్దూ అకాడమీ నియమావళిని అనుసరిస్తూ బోర్డును తక్షణమే ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. ఇదే సమయంలో ఉర్దూ అకాడమీ స్థాపనకు 50ఏ సంవత్సరాలు పూర్తైన సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న 'సర్వర్-ఇ-ఉర్దూ మహోత్సవ్' వేడుకలు ఉర్దూ భాషా, సాహిత్యాల పట్ల ప్రభుత్వ నిబద్ధతను ప్రతిబింబిస్తున్నాయని చెప్పారు. ఈ శుభసందర్భంలో ఆంధ్రప్రదేశ్ ఉర్దూ వర్గాలు ప్రభుత్వం దృష్టికి ఒక అత్యంత కీలకమైన, చట్టబద్ధమైన అంశాన్ని తీసుకువస్తున్నాయని పేర్కొన్నారు. బోర్డు లేకుండా చైర్మన్ తీసుకునే నిర్ణయాలకు సంపూర్ణ చట్టబద్ధత ఉండదని ఉర్దూ వర్గాలు స్పష్టం చేస్తున్నాయని తెలిపారు. ముఖ్యంగా రూల్%-%4లో పేర్కొన్నట్లు బోర్డు సభ్యుల నామినేషన్‌లో రాష్ట్రంలోని అన్ని జిల్లాలకు సముచిత ప్రాతినిధ్యం కలిగినప్పుడే ఉర్దూ భాష, సాహిత్యం, సంస్కృతి అభివృద్ధి రాష్ట్రవ్యాప్తంగా సమానంగా సాధ్యమవుతుందని చెప్పారు. ఇది కేవలం అభిలాష మాత్రమే కాకుండా, అకాడమీ నియమావళి కి అనుగుణమైన పరిపాలనా అవసరమని వారు స్పష్టం చేస్తున్నారు. ఆ కారణంగా ఉర్దూ అకాడమీ నియమావళి%-%1975లోని రూల్%-%4, రూల్%-%9కు అనుగుణంగా ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఉర్దూ అకాడమీకి సంబంధించిన 'బోర్డ్ ఆఫ్ గవర్నర్స్'ను కోరారు. రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే నామినేట్ చేసి కార్యాచరణలోకి తీసుకురావాలని డిమాండ్ చేశారు.

వైవీయూ కెమిస్ట్రీ పరిశోధకుడికి పిహెచ్‌డి

ప్రజాశక్తి - కడప అర్బన్

యోగి వేమన విశ్వవిద్యాలయం రసాయన శాస్త్ర శాఖ స్కాలర్ ఎస్. రామమోహనరెడ్డికి వైవీయూ పరిశోధన డిగ్రీ (పిహెచ్‌డి) అవార్డును ప్రకటించింది. విశ్వవిద్యాలయ కెమిస్ట్రీ శాఖ ప్రొఫెసర్ ఎన్.సి.గంగిరెడ్డి పర్యవేక్షణలో 'హెటెరోసైక్లిక్, ఆర్గానోఫాసరెస్ సమ్మేళనాల కోసం గ్రీన్ సింథటిక్ పద్ధతుల అభివృద్ధి, వాటి ఆప్టోఎలక్ట్రానిక్ లక్షణాల మూల్యాంకనం (డెవలప్మెంట్ ఆఫ్ గ్రీన్స్ సింథటిక్ మెథడాలజీ ఫర్ ఏట్రో సైక్లిక్ అండ్ ఆర్గానో పాస్పరస్ కాంపౌండ్స్ అండ్ ఎవల్యూషన్ ఆఫ్ అప్టోఎలక్ట్రానిక్ ప్రాపర్టీస్)' అనే అంశంపై పరిశోధన సిద్ధాంత గ్రంథాన్ని విశ్వవిద్యాలయనికి సమర్పించారు. విశ్వవిద్యాలయ విసి మార్గదర్శకంలో నియమితులైన సంబంధిత శాఖ నిపుణులు, వైవాస్ కమిటీ పరిశోధకులు సిద్ధాంత గ్రంథానికి డాక్టరేట్ పొందే అర్హత ఉన్నట్లు ప్రకటించారు. ఈ మేరకు విశ్వవిద్యాలయ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ ప్రొఫెసర్ కె.ఎస్.వి. కృష్ణారావు పిహెచ్‌డిని ఎస్. రామమోహనరెడ్డికి ప్రదానం చేస్తూ నోటిఫికేషన్‌ను విడుదల చేశారు. ఈయన రాసిన 8 పరిశోధన పత్రాలు అంతర్జాతీయ ప్రఖ్యాత జర్నల్స్‌లో ప్రచురితమయ్యాయి.


నెరవాడలో రీ సర్వే గ్రామసభ నిర్వహిస్తున్న అధికారులు

రీసర్వేతో భూ సమస్యలు పరిష్కారం

ప్రజాశక్తి - చాపాడు

రీ సర్వేతో భూ సమస్యలు పరిష్కారమవుతాయని రీ సర్వే డిటి నారాయణస్వామి తెలిపారు. నెరవాడ గ్రామంలో జనవరి 2 నుంచి ప్రభుత్వం చేపట్టనున్న భూముల రీ సర్వే కార్యక్రమంపై రైతులకు అవ గాహన కల్పించారు. భూముల రీ సర్వేకు సంబంధించి ప్రభుత్వం విడుదల చేసిన కరపత్రాలను పంపిణీ చేశారు. ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా రీ సర్వే నిర్వ హిస్తోందన్నారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. భూ సర్వే నిర్వహించి ప్రభుత్వమే హద్దురాళ్లను ఏర్పాటు చేస్తుం దని తెలిపారు. సర్వే సిబ్బందికి రైతులు సహకరించాలని సూచించారు. కార్యక్ర మం లో మండల సర్వేయర్ నాగభూషణంరెడ్డి, సచివాలయ సర్వేయర్లు, వీఆర్ ఏలు, టిడిపి నాయకులు సుదర్శన్ యాదవ్, లక్ష్మి నారాయణ, రైతులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న దేవస్థానం చైర్మన్ పివి రమణ

వైకుంఠ ఏకాదశికి ఉత్తర ద్వార దర్శనం : చైర్మన్

ప్రజాశక్తి - వేంపల్లె

వృషభాచలేశ్వర స్వామి దేవస్థానం ఆధ్వర్యంలో వైకుంఠ ఏకాదశి సందర్భంగా ఈనెల 30న ఉత్తర ద్వార దర్శనం కల్పిస్తున్నట్లు ఆ దేవస్థానం చైర్మన్ పివి రమణ తెలిపారు. స్థానిక దేవస్థానం కార్యాలయంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈనెల 30న మంగళవారం ఉదయం తెల వారుజాము నుంచి వైకుంఠం ఏకాదశి సందర్భంగా ఉత్తర ద్వార దర్శనం ఉం టున్నామన్నారు. వేంపల్లెలోని పాపాఘ్ని నది అవతల గట్టున ఉన్న ఎద్దుల కొండపై, నాలుగు రోడ్ల కూడలి సమీపంలో ఉన్న శ్రీవెంకటేశ్వర స్వామి ఆలయంలో వైకుంఠ ఏకాదశి సంబంధించిన ఉత్తర ద్వారా దర్శనం కల్పించేందుకు తగు ఏర్పాట్లు చేయనున్నారు. రెండు ఆలయాల వద్ద సివ సహకారంతో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయనున్నారు. జనవరి 1న ఎద్దుల కొండపైన ప్రతి ఏడాదిలాగే ప్రత్యేక పూజలు, కల్యాణమహోత్సవం, అన్నదాన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విలేకరుల సమావేశంలో ఆలయ ఇఒ హను మంతరావు, పాలక మండలి సభ్యులు శేషగిరి, సునీల్, వరాలు, ఆలయ సిబ్బంది దాసిరెడ్డి, సుధాకర్, ప్రసాద్ పాల్గొన్నారు.

టిడిపి కడప పార్లమెంట్ అధికార ప్రతినిధిగా మురళీమోహన్

ప్రజాశక్తి - సింహాద్రిపురం



తెలుగుదేశం పార్టీ కడప పార్లమెంటు అధికార ప్రతినిధిగా లోమడ మురళీమోహన్ యాదవ్ నియమితులయ్యారు. ఆ మేరకు గురు వారం అధి ష్టానం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ సం దర్భంగా లోమడ మురళీమోహన్ యాదవ్ మాట్లా డుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి లోకేష్ బాబు తనపై నమ్మకంతో ఇచ్చిన పదవికి తప్పక న్యా యం చేస్తానన్నారు. తెలుగుదేశం పార్టీ అభ్యున్నతికి అహర్నిశలు కృషి చేస్తానన్నారు. పార్టీ కార్యక్రమాలను విస్తృతంగా చేపడతానని తెలిపారు. ప్రభుత్వ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరికీ అందజేయడమే లక్ష్యమన్నారు. తనకు పదవి రావడానికి సహకరించిన నియోజకవర్గ టిడిపి ఇన్‌చార్జి మారెడ్డి రవీంద్రనాథరెడ్డి, హెచ్‌ఎల్‌సి హై లెవెల్ కెనాల్ చైర్మన్ జోగిరెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

టిడిపి కడప పార్లమెంట్ కార్యనిర్వాహక కార్యదర్శిగా మహమ్మద్ రఫీ

ప్రజాశక్తి - పులివెందుల రూరల్



పులివెందులలోని రోటరీపురానికి చెందిన టిడిపి నాయకుడు షేక్ మహమ్మద్ రఫీ కడప జిల్లా పార్లమెంటు కార్యనిర్వాహక కార్యదర్శిగా నియ మితులయ్యారు. ఈ సందర్భంగా ఆయన గురువారం మాట్లాడుతూ తనపై నమ్మకంతో, పార్టీకి తాను చేసిన సేవలు గుర్తించి ఈ పదవి ఇచ్చినందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి నారా లోకేష్, ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి, పులివెందుల టిడిపి నియోజకవర్గ ఇన్‌చార్జి మారెడ్డి రవీంద్రనాథరెడ్డి, పార్టీ జిల్లా అధ్యక్షులు భూపేష్‌రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఇచ్చిన పదవికి న్యాయం చేస్తానన్నారు.

అన్నదానం గొప్పది

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు


అన్నదానం చేస్తున్న దాత

నిస్సహాయులు, యాచకుల ఆకలి తీర్చే అన్నదానం చాలా గొప్పదని దాతలు తెలిపారు. క్రిస్మస్ సందర్భంగా గురువారం ఉప్పరపల్లె శ్రీవర కుటుంబ సభ్యులు, ఎన్‌వీఆర్ నిర్మాణ సంస్థ వారు ప్రజాదరణ సేవా సమితి ఆధ్వ ర్యంలో అన్న దానం చేశారు. పట్ట ణంలోని యాచ కులు, నిస్సహాయులు, సాధువులు, వృద్ధులకు అన్నదానం చేశారు. స్థానికులు పేదల గురించి ఆలో చించాలన్నారు. కార్యక్రమంలో శ్రీవరి శ్యాంసుందర్, శాలం రాజు, నారాయణరెడ్డి, సునీల్, లాయర్ సుమంత్, రాజు పాల్గొన్నారు.

మైదుకూరును వెంటాడుతున్న డ్రెయినేజీ సమస్య


కడప రోడ్డులో అధ్వానంగా ఉన్న పారిశుధ్యం

ప్రజాశక్తి - చాపాడు

మైదుకూరు మున్సిపాలిటీని డ్రెయినేజీ సమస్య వెంటా డుతోంది. మున్సిపాలిటీ పరిధిలో పలు లోతట్టు ప్రాంతాలు వర్షాకాలంలో నీటితో చెరువులను తలపిస్తుంటాయి. వర్షపు నీరు వంకలు, ఇతర ప్రాం తాలకు ప్రవహించే ఏర్పాటు లేకపోవడంతో లోతట్టు ప్రాంతాలన్నీ జల మయం అవుతున్నాయి. ముఖ్యంగా కడప రోడ్డులోని సాయినాథపురం, బద్వేల్ రోడ్డులోని సుందరయ్యకాలనీ వద్ద నీరు అధికంగా నిలుస్తున్నది. బద్వేల్ రోడ్డులోని జోసఫ్‌పేట, శాంతి నగర్, మహబూబ్ నగర్, మార్కెట్ రోడ్డు, కడప రోడ్డులోని మసీదు రోడ్డు, రిజిస్టర్ కార్యాలయం రోడ్డు ,బస్టాండ్, నంద్యాల రోడ్డు, ప్రొద్దుటూరు రోడ్డులోని కేసీ కాలువల వద్ద నీటి కుంటలు ఏర్పడుతుండడంతో వాటిలో పందుల బెడద అధికంగా ఉంది. మున్సిపాలిటీ పరిధిలో 110 వరకు నిల్వ ఉండే మురికి కుంటలు ఉన్నట్లు ఆరోగ్య శాఖ సిబ్బంది గుర్తించారు. మురికికుంటలలో దోమలు నిలువ ఉంటూ ప్రజలు అనారోగ్యాల బారిన పడుతున్నారు ఈ మురికి కుంటలు ఆధారం చేసుకొని పందులు అధికంగా తిరుగుతున్నాయి. ప్రధాన రహదారి వెంబడి పందులు ఒక్కసారిగా రోడ్డు దాటుతుండడంతో ద్విచక్ర వాహనదారులు వాటిని ఢీకొని ప్రమాదాలకు గురైన సందర్భాలు కోకొల్లలు. మున్సిపాలిటీ అధికారులు పలు దఫాలు పందుల యజమానులను పిలిపించి మాట్లాడినప్పటికీ ఉపయోగం లేదు. అందులో పందుల యజమానులను మున్సిపాలిటీ వర్కర్లుగా విధుల్లోకి తీసుకుంటామని కచ్చితమైన హామీ లేకపోవడంతో వారు పందుల పెంపకాన్ని వదిలేయడం లేదు. వాటిని ఒక చోట సంరక్షించుకోకుండా ఇష్టానుసారంగా వదులుతున్నారు. అవి మురికి కుంటలలో తిరుగుతూ దుర్వాసన వెదజల్లుతున్నాయి. రోగాలకు కారణమవుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి మున్సిపాలిటీ పరిధిలోని అన్ని వార్డులలో ఉన్న లోతట్టు ప్రాంతాలను గుర్తించి వర్షపు నీరు నిలవకుండా జాగ్రత్తలు చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది.


నంద్యాల రోడ్డులో మురుగు కాలువలో తిరుగుతున్న పందులు

భక్తిశ్రద్ధలతో క్రిస్మస్ వేడుకలు


కాంగ్రెస్ కార్యాలయంలో క్రిస్మస్ కేక్ కట్ చేస్తున్న తులసిరెడ్డి

ప్రజాశక్తి - వేంపల్లె

ప్రపంచ శాంతికి ఏసుక్రీస్తు బోధనలు ఎంతైనా అవసరమని పిసిసి అధికార ప్రతినిధి తులసిరెడ్డి పేర్కొన్నారు. స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో గురువారం క్రిస్మస్ పండుగ సందర్భంగా కాంగ్రెస్ నేతలతో కలిసి ఆయన కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షులు డాక్టర్ సుబ్రహ్మణ్యం, వేంపల్లె మండల శాఖ అధ్యక్షులు రామకృష్ణ, కాంగ్రెస్ సీనియర్ నాయకులు అమర్నాథరెడ్డి, ఉత్తన్న, బండారు వెంకటేశు, చిన్నకోట్ల నాగరాజు, ఐచర్ రమణ, నామా వినయ్, బద్రీనాథ్, వేమా రాజా, రాఘవయ్య పాల్గొన్నారు.

శ్రీచైతన్య పాఠశాలలో..

వేంపల్లెలోని శ్రీచైతన్య పాఠశాలలో గురువారం క్రిస్మస్ వేడుకలను ఆ పాఠశాల కరస్పాండెంట్ చక్రపాణిరెడ్డి ఘనంగా నిర్వ హించారు. క్రిస్మస్ పండుగను పురస్కరించుకుని పాఠశాల ఆవరణ క్రిస్మస్ పండుగ వాతావరణాన్ని సంతరించుకుంది. విద్యార్థులు సాంటా క్లాజ్ వేషధారణ, ఏంజెల్స్ వేషధారణలో క్రిస్మస్ క్యారోల్స్ పాడుతూ అలరించారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ చక్రపాణిరెడ్డి, డైరెక్టర్లు శ్రీచైతన్యరెడ్డి, చేతన్‌రెడ్డి,ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ముద్దనూరు మండల వ్యాప్తంగా..


కేక్ కట్ చేస్తున్న డ్యానియేల్

ముద్దనూరు : క్రిస్మస్ సందర్భంగా మండలంలోని అన్ని చర్చిల్లో క్రైస్తవులు వేడుకలు ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంలోని సిఎస్ఐ, సిఎస్ఐ (ఎస్పిజి) ఆర్‌సిఎం, హెబ్రోన్, మన్నా, హెూసన్న మందిరంలో పాస్టర్లు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. స్థానిక ఎల్ఎమ్ కాం పౌండ్‌లోని సిఎస్ఐ చర్చిలో రెవరెండ్ డ్యానియేల్ క్రిస్మస్ ప్రాముఖ్యతను వివరించారు. కేక్ కట్ చేసి సం బరాలు జరుపుకున్నారు. చిన్నారులు, మహిళలు, ఆట పాటలు, నృ త్యాలతో అలరించారు. క్రికెట్, బాల్ బ్యాడ్మింటన్, కబడ్డీ, రన్నింగ్, లాంగ్ జంప్, స్కిప్పింగ్, మ్యూజికల్ చైర్స్ ఆటల పోటీలు నిర్వహించారు. విజేతలకు సర్పంచ్ సరళ ఆధ్వర్యంలో బహుమతులు అందజేశారు. మండల నాయ కులు డాక్టర్ కటికరెడ్డి మధుసూదనరెడ్డి ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని చర్చిలకు కేక్ వితరణ చేశారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు ఏసుదాస్, యాకోబు, సువార్త, చంద్ర, కిరణ్, చిన్నారులు, యూత్, మహిళలు పాల్గొన్నారు.


గుంతచియ్యపాడు చర్చిలో క్రిస్మస్ కేక్ కట్ చేస్తున్న మహేష్ యాదవ్

ప్రత్యేక అలంకరణలో చర్చిలు..

చాపాడు : మండలంలోని అన్ని గ్రామాల చర్చిల్లో గురువారం క్రిస్మస్ వేడు కలను ఘనంగా నిర్వహించారు. చర్చిలను ప్రత్యేకంగా అలంకరించారు. మత పెద్దలు, ఫాస్టర్‌లు ఏసుక్రీస్తు జీవిత చరిత్ర వివరించారు. బుధవారం రాత్రి నుంచి చర్చిలను ప్రత్యేకంగా అలంకరించి ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

చాపాడు, పల్లవోలు, అనంతపురం, మడూరు, వెదురూరు, రాజుపాలెం, మొర్రాయపల్లి, బద్రిపల్లి, చియ్యపాడు గ్రామాల చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. గుంతచియ్యపాడు చర్చిలో ఘనంగా క్రిస్మస్ వేడుకలను నిర్వహించారు. మాజీ ఎంపిటీసీ, వైసీపీ యువ నాయకుడు దాసరి మహేష్ యాదవ్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి వృద్ధులకు పంపిణీ చేశారు. ఎంపీపీ టి.లక్ష్మయ్య, జడ్పీటీసీ జె రాజీ, టిడిపి మండలశాఖ అధ్యక్షుడు అన్నవరం సుధాకర్ రెడ్డి, టిడిపి నాయకులు మునిశేఖర్ రెడ్డి, తహశీల్దార్ రమా కుమారి, ఎస్ఐ చిన్న పెద్దయ్య, ఎంపిడిఓ వీరకిషోర్ ప్రజలకు క్రిస్మస్ శు భాకాంక్షలు తెలిపారు.


కేక్ కట్ చేస్తున్న రహమతుల్లా, పాస్టర్లు

టిడిపి ఎన్ఆర్ఐ కువైట్ ఉపాధ్యక్షులు ఆధ్వర్యంలో..

కడప అర్బన్ : తెలుగుదేశం పార్టీ ఎన్ఆర్ఐ కువైట్ ఉపాధ్యక్షులు షేక్. రహ్మతుల్లా ఆధ్వర్యంలో క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. క్రైస్తవ పాస్టర్ల సమక్షంలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. కేక్ కటింగ్ చేశారు. ప్రజలకు పండుగ శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా షేక్.రహ్మతుల్లా మాట్లాడుతూ ప్రేమ, త్యాగం, మానవత్వా విలువలు కల్గిన శాంతి స్వరూపుడైన ప్రభువైన ఏసుక్రీస్తు జన్మించిన ఈ పర్వదినాన కులమతలకతీతంగా క్రైస్తవ మతస్థులను క్రిస్మస్ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు మాసాపేట శివ, గాజులపల్లి రాఘవ, కొమ్మలపాటి సుబ్బరాయుడు,చంద్రశేఖర్, సుధాకర్ రెడ్డి, ఏ.వీ.లోకేష్, అనిల్, విశ్వనాథ్, వీరయ్య, ఇర్ఫాన్, అల్లా బకాష్, ఫజ్జు, సాద్, నారాయణ, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

48వ డివిజన్ కృపా కాలనీలో..

కడప : కడప నగరంలోని 48వ డివిజన్ పరిధిలో ఉన్న కృపా కాలనీలో గురువారం క్రిస్మస్ వేడుకలు అత్యంత వైభవంగా నిర్వహించారు. న్యూ నేటివ్ కృపా మినిస్ట్రీస్ అధ్యక్షులు పాస్టర్ పి. మహేష్, సిస్టర్ శాంతమ్మ నేతృత్వంలో నిర్వహించిన ఈ వేడుకలు భక్తిశ్రద్ధలతో, ఉత్సాహభరితంగా సాగాయి. పాస్టర్ మహేష్ ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం పెరుగుతున్న చలి తీవ్రతను దృష్టిలో ఉంచుకుని పాస్టర్ మహేష్ భక్తులకు దుప్పట్లు పంపిణీ చేశారు. అనంతరం అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో బుడగజంగం రాష్ట్ర నాయకులు డి. శ్రీరాములు, దూపం రాజు, చిత్తరి రామయ్య, మహిళా నాయకురాలు ఎస్. విమల, స్థానిక ప్రముఖులు పి.ధనుంజయ రెడ్డి, సునీతలు, సంఘ పెద్దలు పి.రవితేజ, కీర్తన, రోజా,ఏ.అగస్టిన్ శాంతిరాజు, సుగుణమ్మ, రమణమ్మ,పుల్లయ్య కాలనీ ప్రజలు, చిన్నారులు పాల్గొన్నారు.



దుప్పట్లు పంపిణీ చేస్తున్న పాస్టర్ మహేష్

చదువుతో పాటు క్రీడల్లోనూ ఆసక్తి కనబర్చాలి

- డాక్టర్ మండిపల్లి లక్ష్మీప్రసాద్‌రెడ్డి

ప్రజాశక్తి - రాయచోటి

యువత చదువుతో పాటు క్రీడల్లో విశేషంగా రాణిస్తూ ప్రతి ఒక్కరూ కూడా క్రీడా స్ఫూర్తితో మెలగాలని టిడిపి నియోజక వర్గ నాయకులు డాక్టర్ మం డిపల్లి లక్ష్మీప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం పట్టణంలోని జూనియర్ కళాశాల హెలిప్యాడ్ మైదానంలో టిడిపి నాయకులు మడితాటి శ్రీనివాసులురెడ్డితో కలిసి అర్‌పిఎల్ లీగ్ క్రికెట్‌టోర్నమెంట్‌ను ప్రారంభించారు. సందర్భంగా లక్ష్మి ప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ టోర్నమెంట్‌కు మొదటి బహుమతిగా శ్రీనివాసరెడ్డి రూ. లక్ష ,రెండవ బహుమతిగా ఖాదరవల్లి రూ.50 వేలు ప్రకటించి యువత ను ప్రోత్స హించడం అభినందనీయం అన్నారు. టోర్నమెంట్ నిర్వహణ ఏర్పాట్లు గురించి ఆర్గనైజర్‌ని అడిగి తెలుసుకున్నారు. మంత్రి రాంప్రసాద్ రెడ్డి ఆధ్వర్యంలో త్వరలో ఇండోర్ స్టేడియం ప్రారం భిస్తున్నట్లు ఆయన తెలి పారు. కార్యక్రమంలో ఎపిఐఐసి డైరెక్టర్ కొండాభాస్కర్‌రెడ్డి, టిడిపి మండల అధ్యక్షులు యనమల మదన్‌మోహన్, పోలిరెడ్డి సుబ్బారెడ్డి, మదన్‌మోహన్‌రెడ్డి, రాయుడు కాలనీ రంజిత్ రాయల్, మూడవ వార్డు టిడిపి నాయకులు ఖాదర్‌వలి, రామా పురం టిడిపి నాయకులు చెన్నకృష్ణ, మహమ్మద్, టిడిపి నాయకులు, కార్యకర్తలు, యువత పాల్గొన్నారు.


డంపింగ్ యార్డును పరిశీలిస్తున్న రాచినేని శ్రీనివాసులు

చెత్తను డంపింగ్ యార్డులోనే వేయాలి

ప్రజాశక్తి - వేంపల్లె

వేంపల్లెలో సేకరించిన చెత్తను డంపింగ్ యార్డులోనే వేయాలని మాజీ ఇన్‌ఛార్జి సర్పంచ్ రాచినేని శ్రీనివాసులు పేర్కొన్నారు. వేంపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని డంపింగ్ యార్డులో కాకుండా జగనన్న కాలనీ సమీపంలో చెత్తను డంపింగ్ చేస్తున్నారని కాలనీ వాసులు రాచినేని శ్రీనివాసులుకు ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో గురువారం పంచాయతీకి చెందిన డంపింగ్ యార్డును పంచాయతీ సిబ్బందితో కలిసి ఆయన పరిశీలించారు. చెత్త డంపింగ్‌పై పంచాయతీ కార్యదర్శి నాగభూషణంరెడ్డితో చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎక్కడపడితే అక్కడ చెత్తను డంపు చేయవద్దని పారిశుధ్య సిబ్బందిని ఆదేశించారు. డంపింగ్ యార్డ్‌కు దారి సౌకర్యం లేక వేరేచోట వదలాల్సి వచ్చిందని సిబ్బంది ఆయన దృష్టికి తెచ్చారు. అందుకు ఆయన స్పందించి దారి సమస్యను పరిశీలించి తన సొంత నిధులతో జెసిబి తీసుకొచ్చి దారికి గుంతలు పూడ్చి సౌకర్యం చేశారు. ఇంక నుండి డంపింగ్ యార్డ్ లోనే చెత్తను వేయాలని సిబ్బందికి సూచించారు. డంపింగ్ యార్డ్‌లో కాకుండా వేరేచోట వేస్తే సిబ్బందిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆయన వెంట వైసీపీ నేతలున్నారు.


పూర్వ విద్యార్థులతో పాఠశాల యాజమాన్యం

బీరం పాఠశాలలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం

ప్రజాశక్తి - ఖాజీపేట

మండల పరిధిలోని కొత్త నెల్లూరు సమీపంలో ఉన్న బీరం శ్రీధర్‌రెడ్డి అంతర్జాతీయ పాఠశాలలో గురువారం పూర్వ విద్యార్థుల స్ఫూర్తి సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. ఎంతో ఆత్మీయంగా, ఆర్భాటంగా నిర్వ హించిన ఈ కార్యక్రమం అందరినీ ఆకట్టుకుంది. గతంలో ఇక్కడి పాఠ శాలలో చదివి ప్రస్తుతం ఐఐటి, ఎన్ఐటి, ఐఐఐటి వంటి ప్రతిష్టాత్మక జాతీయ విద్యాసంస్థల్లో ఉన్నత విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులు స్వగృహ విద్యాలయానికి విచ్చేసి చిన్నారులతో తమ అనుభవాలను పంచుకున్నారు. జాతీయస్థాయి ప్రవేశ పరీక్షలను అధిగమించి ముందుకెళ్లిన పూర్వ విద్యా ర్థులు తమ ప్రయాణంలోని విజయం, వైఫల్యాలు, క్రమశిక్షణ, దృఢ సంకల్పం, ఒత్తిడిని ఎదుర్కోవడం వంటి అంశాలను విద్యార్థులతో పంచు కున్నారు. తమ స్వీయ అనుభవాలను ఉదా హరణగా ఐఐటి/ఎన్ఐటి విద్యలో విజయం సాధించడానికి అవసరమైన సూచ నలు చేశారు. ఉన్నత విద్యలో ప్రవేశించేందుకు ప్రతిభ మాత్రమే కాదని పట్టు దల, ధైర్యం, నిరం తర అభ్యాసం, పరిస్థితులకు తగినట్లుగా మారే సామర్థ్యం అవసరమన్నారు. ఉపాధ్యాయులు, విద్యాసంస్థ యాజమాన్యం అందించిన సహాయ, సహ కారం, అమలు చేసిన కార్యక్రమాలు ఎంతగానో దోహద పడ్డాయని పూర్వ విద్యార్థులన్నారు. కార్యక్రమంలో బీరం విద్యాసంస్థల కర స్పాండెంట్ సుబ్బారెడ్డి, చైర్పర్సన్ సరస్వతమ్మ, డైరెక్టర్ స్వాతి శ్రీకాంత్, గ్రూప్-1 అధికారి బీరం శ్రీకాంత్‌రెడ్డి విద్యార్థులకు తగిన సూచనలు చేశారు. కార్యక్ర మంలో పాఠశాల ప్రిన్సిపల్ శ్వేతా, కళాశాల ప్రిన్సిపల్ హేమచంద్ర పాల్గొన్నారు.

30 ఎర్రచందనం దుంగలు స్వాధీనం

వీరబల్లి :మండలంలోని వానరాచపల్లి బీటు 828లోని తాటిమానుపెంట ప్రదేశంలో రూ.11,82,620 లక్షల విలువైన 30 ఎర్రచందనం దుంగలను, రూ. 4 లక్షలు విలువచేసే అశోక్ లేలాండ్ దోస్ట్ వాహనాన్ని స్వాధీన ం చేసుకున్నట్లు సానిపాయి రేంజ్ ఆఫీసర్ వైసి రెడ్డి తెలిపారు. డిఎఫ్ఒఆర్ జగన్నాథ్‌సింగ్ ఆదేశాల మేరకు మదనపల్లి సబ్ డిఎఫ్ఒ ఎస్. శ్రీనివాసులు ఆధ్వర్యంలో రాయవరం సెక్షన్ వనరాచపల్లి బీటు లోని తాటిమానుపెంట ప్రదేశంలో ఎర్రచందనం అక్రమరవాణా అవుతుందని తెలిసి సంఘటనా స్థలానికి అటవీశాఖాధికారులు చేరుకున్నారు. గమనించి నిందతులు ఫారెస్ట్ సిబ్బందిని చూసి ఇద్దరు దూకి పారిపోయారు. వాహనాన్ని పరిశీలించగా అందులో 30 ఎర్రచందనం దుంగలు , వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. దాడిలో రాయవరం డిప్యూటీ ఆర్ఒ ఎస్. రమేష్ బాబు, సానిపాయ స్ట్రైక్ ఫోర్స్ సిబ్బంది, సానిపాయ బేస్ క్యాంపు సిబ్బంది పాల్గొన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సానిపాయి రేంజ్ ఆఫీసర్ వై చంద్రారెడ్డి తెలిపారు.

పార్లమెంట్ వైఎస్ ప్రెసిడెంట్‌గా నిస్సార్

రాయచోటి :రాజంపేట పార్లమెంట్ వై.ఎస్. ప్రెసిడెంట్‌గా పట్టణానికి చెందిన వతన్ నిస్సార్ నియమితులయ్యారు. కూటమి ప్రభుత్వం రాయచోటి మైనారిటీ నాయకుడు రాజంపేట పార్లమెంటరీ నియోజకవర్గ అధికార ప్రతినిధి వతన్ నిసార్ పార్టీకి చేసిన సేవలు రాష్ట్ర ప్రభుత్వం గుర్తించి రాజంపేట పార్లమెంట్ వైస్ ప్రెసిడెంట్‌గా పదవి ఇచ్చారు. ఈ సందర్భంగా వతన్‌ని సార్ మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ కోసం బలోపేతానికి పని చేస్తామన్నారు. తనపై నమ్మకంతో సేవలను గుర్తించి పదవి ఇచ్చినందుకు రాష్ట్ర మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డికి, ఆయన సోదరుడు మండిపల్లి లక్ష్మీ ప్రసాద్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

ఎస్ఐగా సుస్మిత బాధ్యతల స్వీకరణ

వీరబల్లి : వీరబల్లి ఎస్ఐగా సి. సుస్మిత గురువారం బాధ్యతలు చేపట్టారు. ఈమె ట్రైనింగ్ పూర్తి మండలానికి వచ్చారు. ఇక్కడ ఎస్ఐగా పనిచేస్తున్న నరసింహారెడ్డి బదిలీపై గాలివీడు మండలానికి వెళ్లారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సాంఘిక కార్యకలాపాలపై ప్రత్యేక దృష్టి సారిస్తామన్నారు. నూతనంగా ఎస్ఐ బాధ్యతలు చేపట్టిన సుస్మితకు పోలీస్ స్టేషన్ సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు. విఆర్‌డిఎస్ స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు సురేంద్ర రెడ్డి ఎస్ఐ సుస్మితను శాలువా కప్పి సన్మానించారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

కంపుకొడుతున్నా.. పట్టించుకోరా..!

కాలువ గట్లపై కోళ్ల వ్యర్థాలు - కాలువలోకి మురుగు నీరు - పట్టని అధికారులు

ప్రజాశక్తి - జమ్మలమడుగు


కాలువ వెంబడి ఉన్న చెత్త చెదారం, కోళ్ల వ్యర్థాలు

జమ్మలమడుగు నుంచి కోవెలకుంటకు వెళ్లే దారిలో ఉన్న మైల వరం ఉత్తర కాలువ వెంబడి కంపుకొడుతోంది. అధికారులు పట్టించుకోవడం లేదని ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. తాడిపత్రి బైపాస్ రోడ్డు నుంచి పెద్ద పసుపు బైపాస్ వరకు మైలవరం కాలువ గట్టు వెంబడి పట్టణం, మోరగుడి గ్రామానికి చెందిన వ్యాపారస్తులు, చికెన్ షాప్ వారు వ్యర్థాలను తీసుకువచ్చి పడేస్తున్నారు. ఆ దారినపోయే వారు దుర్వాసన భరిం చలేకున్నారు. పలు ఇబ్బందులకు గురవుతున్నారు. కోవెలకుంట రోడ్డు వైపున కాలువకు ఓ వైపు సాయిబాబా దేవాలయం మరోవైపు ఆంజ నేయ స్వామి దేవాలయం ఉన్నాయి. కాలువ గట్టు వెంబడి కృష్ణ మందిరం వరకు వెళ్లేందుకు భక్తులు ముక్కులు మూసు కోవాల్సిందే. అటు మోరగుడి గ్రామ పంచాయతీ, ఇటు జమ్మలమడుగు మున్సిపాలిటీ వారు వ్యర్థాలను వేసే వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. రామిరెడ్డిపల్లె మోటు నుంచి వెళ్లే సైడ్ కాలువను మైలవరం ఉత్తర కాలువలోకి కలపడంతో కాలువలో నీరు తాగడానికి లేదా వాహనదారులు స్నానం చేయడానికి వీలు లేకుండా ఉంది. కాలువ వెంబడి ఉన్న చెత్త చెదారం గాలికి వచ్చి కాలువ నీటిలో పడి నీరు కలుషితం అవుతోంది. ఒకప్పుడు మైలవరం ఉత్తర కా లువ నీరు రైతులు తాగడానికి, పంట పొలాలకు స్వచ్ఛమైన నీరు దొరికేదని, ఇప్పుడు కలుషితం కావడంతో పశువులకు కూడా నీరు తాగించలేకున్నామని పేర్కొంటున్నారు. వెంటనే సంబంధిత అధికారులు చొరవ తీసుకొని దేవా లయాల పక్కన, గట్టు వెంబడి వేస్తున్న వ్యర్థాలను వేయకుండా చూడాలని, సైడ్ కాలువను కూడా పూడ్చాలని ప్రజలు కోరుతున్నారు.